సాక్షి
మంచిర్యాల
గురువారం । 14 । డిసెంబర్ । 2023



'ప్రాణహిత'పై ఆశలు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ప్రాణహిత ప్రాజెక్టుపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రాజెక్టును పూర్తి చేసి సాగు నీరందించాలని వారు కోరుతున్నారు. 8లో▸



శనగ సాగే శ్రేయస్కరం 8లో▸

వానాకాలం సాగు చేసిన వరి నారుమళ్లలో తేమ శాతం ఎక్కువగా ఉన్న రైతులు శనగ సాగు చేసుకుంటే శ్రేయస్కారంగా ఉంటుంది. పప్పు దినుసులకు డిమాండ్ అధికంగా ఉంది.

గరిష్టం/కనిష్టం
29.0 /16.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వాయువ్యం దిశగా చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

వేమనపల్లికి బస్సు ప్రారంభం

- 'సాక్షి' కథనానికి స్పందన



స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

వేమనపల్లి: నియోజకవర్గ కేంద్రం బెల్లంపల్లి నుంచి కన్నెపల్లి మీదుగా వేమనపల్లి మండల కేంద్రానికి బుధవారం పల్లెవెలుగు బస్సు ప్రారంభమైంది. ఈ నెల 11న ఫ్రీ జర్నీ.. వారికి దూరం శీర్షిక 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. మండల ప్రజల కష్టాలను ఎంపీటీసీ సంతోష్‌కుమార్ ఎమ్మెల్యే గడ్డం వినోద్ దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల ప్రచారంలో తాను ఇచ్చిన హామీ ప్రకారం డిపో మేనేజర్ రవీంద్రనాథ్‌తో మాట్లాడి పల్లెవెలుగు బస్సు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి వచ్చిన బస్సుకు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు పూలదండలతో స్వాగతం పలికారు. మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన



ఆందోళనలో కాంట్రాక్ట్ కార్మికులు

మంచిర్యాలఅగ్రికల్చర్: విధుల్లో నుంచి తొలగించవద్దని, మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు(స్వీపర్స్) బుధవారం రాత్రి సమీకృత కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. కార్మికులు మాట్లాడుతూ కాంట్రాక్టర్ శ్రీనివాస్ ద్వారా సమీకృత కలెక్టరేట్‌లో విధుల్లో చేరామని, మూడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, వేతనాలు అడిగితే తొలగిస్తామని బెదిరిస్తున్నాడని వాపోయారు. అన్ని శాఖల కార్యాలయాలను శుభ్రపర్చడం, ఆవరణలో మొక్కలకు నీరు పట్టడం, తదితర విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు నగదు తీసుకొని విధుల్లోకి తీసుకున్నాడని, ఇప్పుడు విధుల్లోంచి తొలగిస్తామని అంటున్నారని ఆరోపించారు. నస్పూర్ ఎస్సై రవికుమార్ కార్మికులు నచ్చజెప్పి అక్కడి నుంచి పంపించారు.

అవిశ్వాస నోటీసు తిరస్కరణకు వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న శ్వేత

బెల్లంపల్లి: మున్సిపల్ కౌన్సిలర్లు అవిశ్వాసాన్ని ప్రతిపాదిస్తూ అందజేసిన నోటీసును తిరస్కరించాలని బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్‌ను కోరారు. బుధవారం కలెక్టర్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. కౌన్సిలర్లు తనతోపాటు మున్సిపల్ వైస్ చైర్మన్‌పై వేర్వేరుగా అవిశ్వాసాన్ని ప్రతిపాదించారని తెలిపారు. తెలంగాణ రాజపత్రం నెం-7-2022ను అనుసరించి అవిశ్వాస తీర్మానాన్ని మూడేళ్ల నుంచి నాలుగేళ్లకు పొడగించారని పేర్కొన్నారు. ఆ నిబంధనను అనుసరించి ఎన్నికల చట్టానికి వ్యతిరేకంగా మున్సిపల్ కౌన్సిలర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానాన్ని తిరస్కరించి న్యాయం చేయాలని కోరారు.

14న దివ్యాంగుల ఆటల పోటీలు

మంచిర్యాలటౌన్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 14న జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి దివ్యాంగుల ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె.చిన్నయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరుగు పందెం, షాట్‌పుట్, చెస్, క్యారమ్, జావెలిన్‌త్రో, మ్యూజికల్ చైర్ పోటీల్లో జూనియర్, సీనియర్ విభాగాలు ఉంటాయని, దివ్యాంగులు పోటీల్లో పాల్గొనేందుకు ఈ నెల 14న ఉదయం 9:30 గంటలకు హాజరు కావాలని తెలిపారు. విజేతలకు ఈ నెల 15న మధ్యాహ్నం 12 గంటలకు జిల్లా కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో బహుమతులను అందజేస్తామని తెలిపారు.

అసంపూర్తి.. మళ్లీ గడువు



ఈ చిత్రంలో కనిపిస్తున్నది మందమర్రి రైల్వేగేటు, పాతబస్టాండ్ కూడలి మీదుగా నిర్మిస్తున్న పై వంతెన. గత ఏడాదిన్నరగా పనులు కొనసాగుతున్నాయి. ఇక్కడ వాహనదారులు రాకపోకలు సాగించాలంటే నరకం చూస్తున్నారు. వందలాది భారీ గూడ్స్ వాహనాలతోపాటు కుమురంభీం, మంచిర్యాల జిల్లాల ప్రజల రవాణా రద్దీతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. పనుల్లో జాప్యంతో ఇబ్బంది తప్పడం లేదు.



ప్రమాదకరంగా ఉన్న శ్రీరాంపూర్ బైపాస్ వైపు వెళ్లే రోడ్డు



కుమురంభీం జిల్లా వాంకిడి మండల కేంద్రంలో కొనసాగుతున్న పనులు

- ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాని ఎన్‌హెచ్-363
- జాప్యంపై కాంట్రాక్టర్‌కు పెనాల్టీ వేయడంలో ఉదాసీనత
- వచ్చే జనవరిలోగా పూర్తి చేస్తామంటున్న వైనం
- పూర్తయిన చోట రోడ్డెక్కితే టోల్ బాదుడు

జాప్యం చేస్తే రోజుకు రూ.5లక్షలు

నిర్మాణ సంస్థ సకాలంలో పని చేయకపోతే రోజుకు రూ.5లక్షల చొప్పున జరిమానా వేయొచ్చు. సహేతుక కారణం చూపకుండా అధికారులు నిక్కచ్చిగా ఉంటే ఆ మేరకు వసూలు చేయొచ్చు. పర్యవేక్షించే అధికారులే కాంట్రాక్టర్లకే వత్తాసు పలుకుతూ ప్రొవిజనల్ కంప్లీట్ సర్టిఫికేట్లు(పీసీసీ) ఇచ్చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత ఆరు నెలలుగా మందమర్రి వంతెన పనుల్లో తీవ్ర జాప్యం జరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీటిపై ప్రజల నుంచి అభ్యంతరాలు వస్తున్నాయి. ఇక శ్రీరాంపూర్ రింగ్ రోడ్డుపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రమాద సూచికలు, అత్యవసర సేవలు వంటివి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాల్సి ఉంది. టోల్‌ప్లాజా వద్ద సైతం అసంపూర్తిగా సౌకర్యాలు కల్పిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయి. పనుల జాప్యంపై ప్రాజెక్టు డైరెక్టర్ అజయ్‌మణికుమార్‌ను సంప్రదించగా.. వచ్చే జనవరిలోపు పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నామని చెప్పారు.

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పర్యవేక్షణలో అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల జాప్యం వెరసి రూ.వేల కోట్లతో నిర్మిస్తున్న జాతీయ రహదారి-363 పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన దారులు నిర్మించి మెరుగైన రవాణా అందించాలనే తలంపుతో 'భారత్‌మాల' కింద చేపట్టింది. కింది స్థాయి అధికారుల కారణంగా రాష్ట్ర స్థాయి రోడ్డు పనుల తరహాలోనే కేంద్ర పరిధిలో పనులు జరగడం గమనార్హం. మంచిర్యాల నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు నాలుగు వరుసల దారి నిర్మాణం జరుగుతున్నది తెలిసిందే. పూర్తయిన రోడ్డుకు మాత్రమే 'టోల్' వేస్తున్నామంటూ మందమర్రి, వాంకిడి శివార్లలో రెండు చోట్ల వాహనదారుల నుంచి చార్జీలు వసూలు చేస్తున్నారు.

గడువు మీద గడువులు

ఎన్‌హెచ్ఏఐ(నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా) ప్యాకేజీ-1లో శ్రీరాంపూర్ జీఎం ఆఫీసు నుంచి తాండూర్ మండలం రేపల్లెవాడ వరకు 42కిలోమీటర్లు, ప్యాకేజీ-2లో రేపల్లెవాడ నుంచి వాంకిడి మండలం గోయగాం వరకు 52కిలోమీటర్లు కలిపి మొత్తంగా 94కిలోమీటర్ల రోడ్డు నిర్మించాలి. ప్యాకేజీ-1 నిర్మాణం ఆగస్టు 17, 2020లో ప్రారంభం కాగా, నిబంధనల ప్రకారం 2022 ఆగస్టు 16నాటికే పూర్తి కావాలి. కోవిడ్, అదనపు పనులు, భూ సేకరణ, అటవీ పనులతో జాప్యం జరిగింది. ఇందుకోసం కాంట్రాక్టర్‌కు 15నెలలు అదనంగా గడువు ఇచ్చారు. చివరి గడవు ప్రకారం గత ఆగస్టుకే పూర్తి కావాలి. ఇక ప్యాకేజీ-2 పనులు 2021మార్చి 3న మొదలయ్యాయి. షెడ్యూల్ ప్రకారం ఈ ఏడాది ఫిబ్రవరికే పూర్తి కావాల్సి ఉన్నా కాలేదు. ఈ రెండు ప్యాకేజీ పనులు తాజాగా వచ్చే జనవరిలోపు పూర్తి చేస్తామని ఇక్కడి అధికారులే లక్ష్యంగా పెట్టుకున్నారు.

పూర్తవ్వని పనులు

అధికారులు చెబుతున్న ప్రకారం రోడ్డు దాదాపు 92కిలోమీటర్లు పూర్తయింది. ఆ మేరకు రెండు చోట్ల రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనదారుల నుంచి 'టోల్' వసూలు చేస్తున్నారు. ఇంకా రెండు కిలోమీటర్ల మేర పూర్తి చేయాలి. పూర్తయిన చోట్ల కూడా వరద కాలువలు, లైట్లు, సర్వీస్ రోడ్లు అసంపూర్తిగానే ఉన్నాయి. బ్రిడ్జిలపై లైట్లు చాలా చోట్ల బిగించలేదు. మందమర్రిలో వయోడక్ట్ బ్రిడ్జి పైపుల తొలగింపు ఆలస్యమైందని చెబుతూ జాప్యం చేస్తున్నారు. రెబ్బెన మండలం తక్కళ్లపల్లి వన్యప్రాణుల దారి కోసం ఎకోబ్రిడ్జి, వాంకిడి మండలం గోయగాం శివారు వన్యప్రాణుల కోసం ఓవర్ బ్రిడ్జి, వాంకిడి, రెబ్బెన మండల కేంద్రాల్లో సర్వీస్ రోడ్డు పనులు జరుగుతున్నాయి. వీటితోపాటు భూ సేకరణ పూర్తి చేసిన భవనాల తొలగింపు, రోడ్లకు ఇరువైపుల డ్రెయిన్స్, మధ్యలో మొక్కల పెంపకం చేపట్టాల్సి ఉంది. పేపర్లపై పూర్తయిందని ఉన్నతాధికారులకు నివేదికలు ఇస్తూ కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూరేలా గడువులు పొడగిస్తున్నారు. ఇక ప్యాకేజీ-2 పరిధిలో కేంద్ర విజిలెన్స్ కమిటీ నుంచి విచారణలు సైతం జరిగినా అధికారుల్లో మార్పు రావడం లేదు.

ఎన్‌హెచ్-363 ప్రాజెక్టు వివరాలు

నిర్మించాల్సిన రోడ్డు 94కిలోమీటర్లు
పూర్తయిన రోడ్డు 92కిలోమీటర్లు
ప్యాకేజీ-1 నిర్మాణ విలువ రూ.1,356కోట్లు (2020నాటికి)
పెరిగిన విలువ, ఇతర ఖర్చులతో రూ.1948కోట్లు (ప్రస్తుతం)
ప్యాకేజీ-2 నిర్మాణ విలువ రూ.1,140కోట్లు (2021నాటికి)
పెరిగిన విలువ, ఇతర ఖర్చులతో సుమారు రూ.1200కోట్లు (ప్రస్తుతం)

కార్పొరేట్ స్థాయి వైద్యం అందేలా కృషి

- వైద్యులు అందుబాటులో ఉండాలి
- ఉదయం 6గంటల నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటా
- చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి



ఆరోగ్యశ్రీ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వివేక్, అధికారులు

చెన్నూర్: చెన్నూర్ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందేలా కృషి చేస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం మహాలక్ష్మి ఉచిత బస్సు సౌకర్యం, రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, కలెక్టర్ సంతోష్, డీఎంహెచ్‌వో సుబ్బరాయుడులతో కలిసి ప్రారంభించారు. అనంతరం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వివేక్ మాట్లాడుతూ మరో నాలుగు పథకాలను త్వరలోనే ప్రారంభిసామని చెప్పారు. కోవిడ్ రోగులకు ఆరోగ్యశ్రీ వర్తింపజేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వాని కోరితే పట్టించుకోలేదని ఆరోపించారు. పేదలకు ఖరీదైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల భర్తీకి కృషి చేస్తానని చెప్పారు. త్వరలో అభివృద్ధి పనులకు సంబంధించిన కాంట్రాక్టర్ల సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలని తెలిపారు. వారానికి మూడు రోజులు ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు క్యాంప్ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శేషాద్రి, మంచిర్యాల ఆర్డీవో రాములు, జెడ్పీ సీఈవో నరేందర్, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, వైద్యులు అరవింద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

'చుక్క' పొడిచేనా..!

- గెలుపు కోసం ఏఐటీయూసీ ఆరాటం
- 20 ఏళ్ల నుంచి ప్రతిపక్ష సంఘంగానే..
- గుర్తింపు ఎన్నికల్లో మొదటి జెండా ఏఐటీయూసీదే
- హ్యాట్రిక్ తర్వాత అంతరం



శ్రీరాంపూర్: సింగరేణిలో మొదటిసారిగా జెండా ఎగురవేసిన చుక్క గుర్తు సంఘం ఏఐటీయూసీ తిరిగి ఈ ఎన్నికల్లోనైనా జెండా ఎగురవేస్తుందా అనే చర్చ జరుగుతోంది. రెండు దశాబ్దాలుగా ప్రతిపక్ష సంఘంగా ఉంటున్న ఏఐటీయూసీ ఈసారి ఎలాగైనా గుర్తింపు సంఘంగా గెలువాలని ఉవ్విళ్లూరుతోంది. పూర్వవైభవం కోసం ఆరాట పడుతోంది. సింగరేణిలో 1998లో గుర్తింపు సంఘం ఎన్నికలు ప్రారంభమయ్యాయి. మొదటిసారి ఎన్నికల్లో ఏఐటీయూసీ విజయభేరి మోగించింది. ఆ తర్వాత 2001, 2003లో కూడా కూడా గుర్తింపు సంఘంగా గెలిచి హ్యాట్రిక్ విజయం నమోదు చేసుకుంది. తర్వాత నుంచి ప్రతిపక్ష సంఘంగా ఎదురీదుతోంది. ఇటీవల జరిగిన రాజకీయ మార్పులతో ఈ ఏడో దఫా ఎన్నికల్లో ఎలాగైనా గెలుస్తామని ఆ యూనియన్ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

త్యాగాల చరిత్ర మీద..

సింగరేణిలో ఏ కార్మిక సంఘానికి లేని పోరాటాల చరిత్ర ఏఐటీయూసీకే ఉందని చెప్పవచ్చు. ఎంతోమంది ఆ యూనియన్ నాయకులు కార్మికవర్గ హక్కుల పోరాటంలో అమరులయ్యారు. గోలేటీలో రమణారెడ్డి, మందమర్రిలో వీకే అబ్రహం, శ్రీరాంపూర్‌లో పీ.నర్సయ్య, గోదావరిఖనిలో భాస్కర్ రావు వంటి దిగ్గజ నేతలు కార్మికపోరాటాల్లో అమరులయ్యారు. ఈ త్యాగాలు, పోరాటాల ఫలితంగానే సింగరేణిలో మొదటి మూడు సార్లు గెలిచి హ్యాట్రిక్ సాధించారు. తర్వాత డివిజన్లలో పెరిగిన అహంకార ధోరణి, అవినీతి మరకలు అధికారం నుంచి దూరం చేశాయి. వారిపై వ్యతిరేకతతో ఐఎన్టీయూసీ గెలువడం, అన్నీ చక్కదిద్దుకొన్న సమయానికి ఉవ్వెత్తున లేచిన తెలంగాణ ఉద్యమం, సెంటిమెంట్‌తో ప్రాంతీయ సంఘమైన టీబీజీకేఎస్ రెండు పర్యాయాలు గెలిచిన ఏఐటీయూసీ అధికారాన్ని దూరం చేసింది.

యువతరంపై గురి..

ప్రస్తుతం ఏఐటీయూసీ యువతరం ఓట్లపై గురి పెట్టింది. సింగరేణిలో ఈ త్యాగాలను కళ్లారా చూసిన పాత తరం కార్మికులు, సీనియర్ క్యాడర్ అంతా కూడా నేడు రిటైర్డ్ అయ్యారు. ఇప్పుడు వారు లేనిలోటు కనిపిస్తోంది. సింగరేణిలో ప్రస్తుతం 39,748 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో కారుణ్య ఉద్యోగాల కింద చేసిన 16 వేల మంది యువ కార్మికులు ఉన్నారు. ఈ ఓట్లే కార్మిక సంఘాల గెలుపునకు కీలకంగా మారనున్నాయి. వీరికి సింగరేణిలో జరిగిన కార్మిక పోరాటాలను వినడమే గానీ ప్రత్యక్షంగా చూసిన అనుభవం లేదు. ఈ వర్గం కార్మికుల ఓట్ల కోసమే నేడు ఏఐటీయూసీ తీవ్రంగా కృషి చేస్తోంది. తమ త్యాగాలను గుర్తు చేస్తూ వారిని ఏఐటీయూసీలో చేర్పించుకొనే కార్యక్రమాలు ముమ్మరం చేశారు. వారి ఓట్లకే గాలం వేసే పనిలో నేతలు నిమగ్నం అయ్యారు.

శాశ్వత హక్కులు... పదేళ్లుగా పోరాటం

సింగరేణిలో తాము సాధించిన శాశ్వత హక్కులు, ఈ పదేళ్లలో సమస్యలపై చేసిన పోరాటాలే ఈ ఎన్నికల్లో గెలిపిస్తాయనే ధీమాలో ఏఐటీయూసీ నేతలు ఉన్నారు. దీపావళీ బోనస్, లాభాల వాటా, పెన్షన్, రఘునాథరెడ్డి అవార్డు వంటి శాశ్వత హక్కులను ఏ జాతీయ సంఘంతో సంబంధం లేకుండా ఒంటరిగా సాధించామని కార్మికులకు గుర్తు చేస్తున్నారు. గత పదేళ్ల సింగరేణిలో పలు సమస్యలపై చేసిన పోరాటాలు కూడా ఈ ఎన్నికల్లో కలిసి వస్తాయని నేతలు భావిస్తున్నారు. దీంతోపాటు తాము గెలిస్తే 250 గజాల ఇంటి స్థలం, రూ.25 లక్షల వడ్డీ లేని ఇంటి రుణం, పెర్క్స్‌పై ఐటీ రీయింబర్స్‌మెంట్ వంటి హామీల మేనిఫెస్టోతో కార్మికులను తమవైపు మరల్చుకుంటున్నారు. ఏఐటీయూసీ త్యాగాలు, సాధించిన హక్కులను గుర్తించి కార్మికులు ఓటేసి గెలిపిస్తారా లేదా అన్నది డిసెంబర్ 27 రాత్రికి తేలనుంది.

మిగిలింది రెండ్రోజులే..

- యూడైస్ ఆన్‌లైన్ నమోదుకు గడువు 15వరకు
- విద్యార్థుల వివరాల నమోదులో రాష్ట్రంలో ఫస్ట్
- పాఠశాలల సమాచార నమోదులో మూడో స్థానం

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, విద్యార్థుల పూర్తి సమాచారం ఆన్‌లైన్ (2023-24 యూడైస్) నమోదుకు రెండ్రోజులే మిగిలి ఉంది. గడువు ఈ నెల 15న పూర్తి కానుంది. పాఠశాలలు, విద్యార్థుల వివరాలకు సంబంధించిన పత్రాలు(మూడు సెట్లను) కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు అందజేయాల్సి ఉంటుంది. ఈ నెల 20లోపు క్షేత్రస్థాయి పరిశీలన చేసి సమాచారం పక్కాగా ఉందో..? లేదో.. సరిచూసి ధ్రువీకరించాల్సి ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థుల పూర్తి సమాచారం ఆన్‌లైన్ నమోదు 84.98శాతంతో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. పాఠశాల వివరాలు ఆన్‌లైన్ నమోదులో మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

విద్యార్థుల వివరాల్లో ఫస్ట్..

విద్యార్థుల వివరాల నమోదుకు పాఠశాల విద్యాశాఖ పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ప్రతీ పాఠశాలలో విద్యార్థుల వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. గతంలో నమోదైనా వివరాలు అప్‌డేట్ చేయాలి. విద్యార్థికి సంబంధించిన వివరాల నమోదులో రాష్ట్రంలోనే జిల్లా నంబరు వన్ స్థానంలో నిలిచింది. 1085 పాఠశాలల్లో 1,29,019 విద్యార్థులకు గాను 1,09634 మందికి సంబంధించిన వివరాలు ఆన్‌లైన్ నమోదు పూర్తయింది. 9,558 మంది విద్యార్థులకు సంబంధించి ఇంకా ప్రారంభించకపోగా 3,992 మంది విద్యార్థుల సమాచారం ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతోంది. పూర్తి సమాచారం నమోదులో మాత్రం మూడో స్థానానికి పరిమితమైంది. 1085 పాఠశాలల్లో 871 పాఠశాలలు పూర్తి చేయగా(80.28 శాతం) 214 పాఠశాలల్లో ఆన్‌లైన్ నమోదు ప్రారంభించలేదు. పాఠశాల సమాచారంతోపాటు విద్యార్థుల వివరాల నమోదుకు విద్యాశాఖ యుడైస్ పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. ప్రతీ పాఠశాలలో చదివే విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ నమోదు తప్పనిసరి. పాఠశాల నుంచి విద్యార్థుల వివరాలను తొలగించి కొత్తగా ప్రవేశం పొందిన వారి వివరాలు ఎప్పటికప్పుడు చేర్చాలి. విద్యార్థుల వివరాల నమోదు మేరకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందిస్తారు. యూడైస్ ఆన్‌లైన్ నమోదు చేయాల్సిన పాఠశాలల్లో ప్రైవేట్ ఉన్నట్లు తెలుస్తోంది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లు ఉన్నారా.. అర్హులైన వారెందరు... ఇతర వివరాలు నమోదు చేయాల్సి ఉండడంతో కాస్త వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు సమయం ఉంది కదా..? అని వేచి చూసే ధోరణితో ఆన్‌లైన్ ప్రక్రియ నత్తనకడన సాగుతోంది. ఈ నెల 15వరకు గడువు పూర్తి కానుండడంతో ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలని సెక్టోరల్ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

సిరులు కురిపిస్తున్న సన్నాలు

- గత యేడాది కంటే అధిక ధర
- అన్నదాతల హర్షాతిరేకాలు



కల్లం వద్దనే తూకం

దండేపల్లి: జిల్లాలో వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈసారీ సన్న రకం వరి సాగు చేసిన రైతులకు సిరులు కురుస్తున్నాయి. గతయేడాది కంటే ఈ ఏడాది మంచి ధర పలుకుతోంది. జిల్లాలో ఖరీఫ్‌లో లక్షా 57 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల్లోని రైతులు 60 శాతం దొడ్డు, మరో 40 శాతం సన్నరకాల వరి ధాన్యం పండించారు. సన్నరకాల్లో 101, చిట్టి పొట్టి రకాలను సాగు చేశారు. గత ఏడాది సన్నరకాలకు క్వింటాల్‌కు రూ.2,300 నుంచి రూ.2,500 మాత్రమే ధర పలికింది. ఈసారి క్వింటాల్‌కు రూ.3వేలకు పైనే ధర పలుకుతోంది. దీంతో సన్నరకాలు సాగు చేసిన రైతులకు కలిసొచ్చిందనే చెప్పవచ్చు. తేమతో సంబంధం లేకుండా వ్యాపారులు పచ్చి ధాన్యాన్ని కూడా తూకం వేస్తున్నారు. పంట పొలంలో హార్వెస్టర్‌తో కోసిన వెంటనే కొనుగోలు చేస్తున్నారు. పచ్చి ధాన్యం క్వింటాల్‌కు రూ.3వేలు, తేమ లేకుండా ఉంటే క్వింటాల్‌కు రూ.3,100 వరకు ధర చెల్లిస్తున్నారు. సన్నరకాలకు డిమాండ్ ఉండడంతో ధర లభిస్తోంది. సన్నరకాలు సాగు చేసిన వారికి దిగుబడులు కూడా ఆశించిన స్థాయిలో వచ్చాయి. గత ఏడాది ఎకరాకు 22 నుంచి 25 బస్తాల దిగుబడి రాగా, ఈసారి 30 నుంచి 35 బస్తాల వరకు దిగుబడి వచ్చినట్లు రైతులు పేర్కొంటున్నారు. ధర, దిగుబడి పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సన్నాలు సాగు చేసిన రైతుల ధాన్యం వ్యాపారులే కల్లాల వద్ద పోటీ పడి కొనుగోలు చేస్తున్నారు. దొడ్డు రకాలు సాగు చేసిన రైతులు కొనుగోలు కేంద్రాల్లో కుప్పలుగా పోసి తేమ తగ్గే వరకు పడిగాపులు కాస్తున్నారు.

మంచి ధర ఉంది..



సన్నరకాలకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి మంచి ధర ఉంది. పంట కోయడమే లేటు. వ్యాపారులు కల్లాల వద్దకే వచ్చి కాంటా పెడుతుంద్రు. పోయిన సారికంటే ఈసారి క్వింటాల్‌కు రూ.500 ఎక్కువ ఉంది. దిగుబడి కూడా గత యేడు కంటే బాగానే ఉంది.

– సిరిపురం సత్తన్న, రైతు, దండేపల్లి

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



కమిషనర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పీఎస్సార్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీలు మంచిర్యాల, నస్పూరు, లక్సెట్టిపేట పరిధిలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఆయా మున్సిపాల్టీల కమిషనర్లతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలో ఇప్పటివరకు చేపట్టిన పనుల వివరాలతోపాటు టెండర్లు నిర్వహించి, పనులు ప్రారంభించని వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ అధికారులను పిలిపించి తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని, వచ్చే వేసవిలో ఒక్కరోజు కూడా తాగునీటికి ఇబ్బంది రావద్దని హెచ్చరించారు. కమర్షియల్ భవనాలు ఒక్కటీ నిబంధనలు పాటించడం లేదని, వాటికి నోటీసులు జారీ చేయాలని, విద్యుత్ దీపాలను ప్రతీ కాలనీలో పని చేసేలా చూడాలని తెలిపారు.

సంక్రాంతి వరకు నీటి సమస్య పరిష్కారం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జనవరి 14 సంక్రాంతి వరకు మంచిర్యాల, నస్పూర్ మున్సిపాల్టీల్లో నీటి సమస్య తీరుస్తామని ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. బుధవారం ఆయన హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని గోదావరి తీరాన ఉన్న మంచిర్యాల మున్సిపాలిటీ ఇంటెక్ వెల్ తోపాటు మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని సందర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కడెం ప్రాజెక్ట్, గూడెం ఎత్తిపోతల పథకం ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీటిని సరఫరా చేసి రైతాంగానికి సాగు నీటి ఇబ్బందులు తీరుస్తామని అన్నారు. ఈ ప్రాంత సాగు, తాగునీటి అవసరాలు తీర్చాకనే ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటిని ఇతర ప్రాంతాలకు తరలించేలా చూస్తామని అన్నారు. మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ మధుసూదన్, ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ఈఈ స్వామి, డీఈ బుచ్చిబాబు, గూడెం లిఫ్ట్ ఈఈ దశరథ్, ఎల్లంపల్లి ఏఈఈలు రాజ్‌కుమార్, జాకీర్, ఎంపీటీసీలు డేగ బాపు, ఒడ్డె బాలరాజ్, కాంగ్రెస్ నాయకులు మాధవరపు రాజేశ్వర్‌రావు, బొడ్డు శంకర్, దొమ్మటి సత్తయ్య, ఒడ్డె శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడు మృతి


సాయిచరణ్ (ఫైల్)

నస్పూర్: పట్టణ పరిధిలోని విలేజ్ నస్పూర్ టర్నింగ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీసీసీ నస్పూర్ ఎస్సై రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపూర్ ఏరియాలోని అరుణక్కనగర్‌కు చెందిన భానోత్ సిద్దార్థ, గొడిసెల సాయిచరణ్ (17) మంగళవారం సాయంత్రం బైక్‌పై మంచిర్యాలకు వెళ్లి వస్తుండగా అదుపుతప్పి డివైడర్‌కు ఢీకొన్నారు. కిందపడిపోవడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. 108లో మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా సాయిచరణ్ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. సిద్దార్థ సోదరుడు బానోత్ సాయి వికాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండ సురేశ్‌పై మరో చీటింగ్ కేసు

మంచిర్యాలక్రైం: జైపూర్ మండలం రామారావుపేటకు చెందిన గుండ సురేశ్‌పై మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో చీటింగ్ కేసు నమోదైనట్లు సీఐ రాజు తెలిపారు. ఎనిమిదేళ్ల క్రితం సురేశ్ హైదరాబాద్‌లో అంకుర కార్పొరేషన్ సొల్యూషన్ పేరుతో ఓ కంపనీని స్థాపించాడు. బంధువులు, స్నేహితులతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా రూ.50 కోట్లకు పైగా పెట్టుబడులు పెట్టించాడు. కొంతకాలంగా అతను కనిపించకపోవడంతో బాధితుల ఫిర్యాదు మేరకు హైదరాబాద్, వరంగల్‌లో ఇదివరకే కేసులు నమోదయ్యాయి. తాజాగా రామారావు పేట శివారులోని ఆరున్నర ఏకరాల స్థలం రూ.కోటి 28 లక్షలకు నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన అమరవేన నర్సగౌడ్‌కు విక్రయించేందుకు ఒప్పందం చేసుకున్నాడు. ఒప్పందం ప్రకారం నగదు మొత్తాన్ని నర్సగౌడ్ చెల్లించాడు. సదరు భూమిని అతనికి అమ్మకుండా వేరే వ్యక్తులకు అమ్ముకుని కొంతకాలంగా అదృశ్యమయ్యాడు. దీంతో నర్సగౌడ్ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కాంగ్రెస్‌లో కొనసాగుతున్న చేరికలు


కాంగ్రెస్‌లో చేరుతున్న రాంచందర్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలోని బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరుతున్నారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన 1వ వార్డు కౌన్సిలర్ బుద్దార్థి సత్తమ్మ, ఆమె భర్త బుద్దార్థి రాంచందర్ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నివాసంలో కాంగ్రెస్‌లో చేరారు.

మహిళల అభివృద్ధికి కృషి

నస్పూర్: బాలికలు, మహిళల సంరక్షణ, సంక్షేమం, అభివృద్ధికోసం మహిళా సాధికారత హబ్ కృషి చేస్తుందని హబ్ జిల్లా కోఆర్డినేటర్ సాజన్య తెలిపారు. తీగల్‌పహడ్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, కృష్ణ వేణి టాలెంట్ స్కూల్‌లలో హబ్ జెండర్ స్పెషలిస్టు మౌనిక, విజయ, ఆర్థిక అక్షరాస్యత నిపుణురాలు లిప్సిక బుధవారం అవగాహన కల్పించారు.

శనగ సాగే శ్రేయస్కరం

ఉమ్మడి జిల్లాలో వానాకాలం సాగు చేసిన పంట దిగుబడులు వస్తున్నాయి. దీంతో కొద్దిరోజుల నుంచి రైతులు యాసంగి సాగుకు శ్రీకారం చుట్టారు. వానాకాలం సాగు చేసిన వరి నారుమళ్లలో తేమ శాతం ఎక్కువగా ఉన్న రైతులు శనగ సాగు చేసుకుంటే శ్రేయస్కారంగా ఉంటుంది. యాసంగిలో వరికి బదులుగా పప్పు దినుసులు, నూనె గింజలు, కూరగాయల పంటలు సాగు చేసుకోవాలని వ్యవసాయ పరిశోధన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త శ్రీధర్‌చౌహన్ సూచిస్తున్నారు. పప్పు దినుసులకు మార్కెట్‌లో డిమాండ్ అధికంగా ఉంది. డిమాండ్‌కు అనుగుణంగా పంటలు సాగు చేసుకుంటే మంచి లాభాలు ఆర్జించవచ్చంటున్నారు. పంట సాగుకు చేపట్టాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన మాటల్లోనే...

- యాసంగిలో అనువైన పంట
- నల్లరేగడి నేలలు అనుకూలం


శనగ పంట (ఫైల్)

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో శనగ సాగుకు అనుకూలమైన నేలలు 70 శాతం ఉన్నాయి. అంతేకాకుండా కొద్దిపాటి నీటితడులతో పంట సాగు చేసుకోవచ్చు. జిల్లాలో చలి వాతావరణం ఎక్కువగా ఉండటం, డిసెంబర్, జనవరి మాసాల్లో మంచు ఎక్కువగా కురుస్తుండడం వలన పంట దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది. నవంబర్ నుంచి డిసెంబర్ చివరి వరకు విత్తనం విత్తుకుంటే ఆశించిన దిగుబడి సాధించవచ్చు. పంట సాగులో కొద్దిపాటి సూచనలు పాటిస్తే అధిక లాభాలు సాధించవచ్చు.

విత్తనం వేసుకునే సమయం..

యాసంగిలో నవంబర్ మొదటి వారం నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు శనగ సాగు చేసుకోవచ్చు. డిసెంబర్ తర్వాత విత్తుకుంటే పూత, కాత సమయంలో వాతావరణ మార్పులతో పంట దిగుబడి తగ్గిపోయే అవకాశం ఉంటుంది.

నేలలు..

సారవంతమైన నల్లరేగడి నేలలు శనగ సాగుకు అనుకూలం. నల్లరేగడి నేలల్లో నిల్వ ఉండే తేమను ఉపయోగించుకుంటూ శీతాకాలంలో మంచుతో మొక్కల్లో పెరుగుదల ఎక్కువగా ఉంటుంది. చౌడు భూముల్లో విత్తితే ఆశించిన దిగుబడి రాదు. తొలకరిలో వేసిన వరి పైరును కోసిన తర్వాత భూమిని నాగలితో ఒకసారి, గొర్రుతో రెండుసార్లు మెత్తగా దున్ని చదును చేయాలి.

విత్తన రకాలు

శ్వేతరకం: ఈ విత్తనం 80 నుంచి 85 రోజుల వ్యవధిలో పంట దిగుబడి చేతికొస్తుంది. త్వరగా కాపుకు వచ్చే రకం. ఎండ, తెగులును తట్టుకునే కాబూలి రకం ఆలస్యంగా వేసుకోవడానికి అనుకూలం. నవంబర్ తర్వాత కూడా విత్తుకునే అవకాశం ఉంటుంది.

క్రాంతి: మొక్కలు గుబురుగా పెరిగి గింజలు మధ్య స్థలం కాసి లావుగా ఉంటాయి. ఎండు తెగులును తట్టుకునే రకం. 100 నుంచి 105 రోజుల్లో పంట దిగుబడి వస్తుంది.

అన్నెగిరి: మొక్కలు గుబురుగా పెరిగి, కొమ్మలు ఎక్కువగా వేస్తుంది. గింజలు గోధుమ రంగులో నున్నగా, లావుగా ఉంటాయి. 100 నుంచి 110 రోజుల్లో పంట దిగుబడి వస్తుంది.

జ్యోతి: మొక్క కింది నుంచి గుబురుగా కొమ్మలు వేస్తుంది. గింజలు గరకగా ఉంటాయి. మధ్య స్థలం కాయలు కాస్తాయి. 110 రోజుల్లో పంట చేతికి వస్తుంది.

పూలేజీ 95311: కామూలి రకం గింజలు లావుగా హైబ్రిడ్‌లా ఉంటాయి. 95 నుంచి 100 రోజుల్లో పంట దిగుబడి వస్తుంది.

విత్తుకోవడం ఇలా..

- విత్తనాలు ఎకరాకు 25 కిలోల నుంచి 30 కిలోల వరకు విత్తుకోవాలి. గింజ సైజును బట్టి లేదా ఆలస్యంగా డిసెంబర్ 15 తర్వాత వేసుకుంటే 20 శాతం పెంచాలి. లావుగా ఉండే కాబూలి రకాలు ఎకరాకు 30 నుంచి 40 కిలోలు వేసుకోవాలి.
- గొర్రుతో గానీ బర్రలతో గానీ జడ్డింగంతో గానీ విత్తుకోవాలి. భూమిలో పదును తక్కువగా ఉన్నప్పుడు నాగలితో విత్తుకోవచ్చు.

ఎరువులు: ఎకరాకు 8 కిలోల భాస్వరం. 16 కిలోల గంధకాన్నిచ్చే ఎరువులను చివరి దుక్కిలో వేసుకోవాలి.

నీటితడులు: భూమిలో ఎక్కువగా తేమ ఉన్నట్లయితే నీరు అందించాల్సిన అవసరం ఉండదు. పూత, కాత దశలో ఉన్నప్పుడు భూమిలో పూర్తిగా పగుళ్లు తేలినట్లు ఉండి ఎండిపోయే సమయంలో కొద్దిపాటి నీరం దిస్తే సరిపోతుంది. శనగ వర్షాధారపు పంట. తేలికపాటి నీటి తడులు ఇచ్చి అధిక దిగుబడి పొందవచ్చు. నీటితడులు పెట్టేటప్పుడు నీరు నిల్వ ఉండకుండా చూడాలి. పూత దశకు ముందు ఒకసారి, కాయ దశలో మరోసారి నీటితడి అందించాలి.

విత్తన శుద్ధి

- ఎండు తెగులు ఉన్నచోట కిలో విత్తనానికి 4 గ్రాములు ట్రైకోడెర్మా విరిడిని వాడితే మంచి ఫలితం ఉంటుంది.
- విత్తనానికి రైజోబియంకల్చర్ పట్టించి విత్తితే 20 శాతం నుంచి 30 శాతం అధిక దిగుబడి సాధించవచ్చు.
- 8 కిలోల శనగ విత్తనానికి ఒక రైజోబియం ప్యాకెట్ (200 గ్రాములు) కలిపి విత్తనం వేసుకుంటే పంటను చీడ పీడలు ఆశించవు.

పత్రాలు విసిరి కొట్టిన ఘటనపై విచారణ


మాట్లాడుతున్న డీటీవో రాజేశ్వర్

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఏడీఏ ఎల్తూరి సురేఖపై వేతనాల బిల్లు పత్రాలు విసిరికొట్టిన ఘటనపై బుధవారం డీటీవో జాడి రాజేశ్వర్ విచారణ చేపట్టారు. సబ్ ట్రెజరీ కార్యాలయానికి వెళ్లి ఎస్టీవో గీత, ఏటీవో సంధ్య నుంచి వివరణ తీసుకున్నారు. ఆ ఇద్దరి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ప్రత్యక్ష సాక్షులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మరో రెండు రోజుల్లో బాధితురాలైన ఏడీఏ సురేఖ స్టేట్‌మెంట్ రికార్డు చేసుకుని ఆ రెండు నివేదికలను క్రోడీకరించి ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు డీటీవో తెలిపారు.

బాలికపై లైంగికదాడి

- యువకుడిపై పోక్సో కేసు

జైనూర్: కుమురంభీం జిల్లా జైనూర్ మండలంలోని ఓ గ్రామంలో బాలికపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువకుడు (23) ఆదివారం అదే గ్రామానికి చెందిన బాలిక (8)ను ఇంటికి పిలిచి అత్యాచారానికి పాల్పడ్డాడు. మంగళవారం రాత్రి సదరు బాలికకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులకు విషయం తెలిపింది. దీంతో తల్లిదండ్రులు జైనూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో యువకుడిపై బుధవారం పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

‘ప్రాణహిత’పై ఆశలు

- స్వరాష్ట్రంలో కదలని ప్రాజెక్టు పనులు
- తుమ్మిడిహెట్టి నిర్మాణం చేపడతామని కాంగ్రెస్ హామీలు
- నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు


తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది


తుమ్మిడి హెట్టి వద్ద రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు (ఫైల్)

కౌటాల(సిర్పూర్): దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ కౌటాల మండలం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టారు. ఆయన మరణానంతరం.. స్వరాష్ట్రంలో ప్రాజెక్ట్ పనులు ముందుకు సాగలేదు. అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ‘ప్రాణహిత’ మరుగున పడిపోయింది. మళ్లీ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గురువారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి ఓ నిర్ణయానికి రావాలని కోరుతున్నారు.

సాగు, తాగునీటి కోసం..

రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో 16.40 లక్షల ఎకరాలకు సాగు, తాగునీరు, జంటనగరాలకు సైతం తాగునీరు అందించడానికి రూ.38,500 కోట్ల వ్యయంతో 2008లో ప్రాణహిత ప్రాజెక్టు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కాలువల నిర్మాణానికి కాంట్రాక్టర్లకు మొబలైజేషన్ అడ్వాన్సులు చెల్లించారు. కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, దహెగాం మండలాల్లో కాలువల నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.1.27 లక్షల చొప్పున చెల్లించి పనులు ప్రారంభించింది.

స్వరాష్ట్రంలో నిరాశ..

కుమురం భీం జిల్లాలోని తుమ్మిడిహెట్టి వద్ద వార్ధా, పెన్‌గంగ నదుల కలయికతో ప్రాణహిత ఏర్పడింది. రెండు నదులు సంగమించే ప్రదేశంలోనే ప్రాణహిత ప్రాజెక్ట్ నిర్మించాలని డిజైన్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టును టీఆర్ఎస్(ప్రస్తుత బీఆర్ఎస్) అధికారంలోకి రాగానే రీడిజైనింగ్ పేరుతో తుమ్మిడిహెట్టి నుంచి కాళేశ్వరం సమీపంలో మేడిగడ్డకు తరలించింది. ప్రాణహిత ప్రాజెక్టును రీడిజైనింగ్ చేసి 152 నుంచి 148 మీటర్ల ఎత్తుకు తగ్గించినా పనులు ముందుకు సాగలేదు. బ్యారేజీ నిర్మించి కుమురం భీం, మంచిర్యాల జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టుకు 2014- 15 బడ్జెట్‌లో రూ.2486.19 కోట్ల నిధులు కేటాయించారు. 2015- 16లో రూ.1373.94 కోట్లు, 2016- 17లో రూ.685.30 కోట్లు, 2017- 18లో రూ.775.44 కోట్లు కేటాయించారు. అలాగే 2018- 19లో రూ.220 కోట్లు, 2019- 20లో రూ.17.31 కోట్లు, 2020- 21లో రూ.12 కోట్లు కేటాయించినా పనులు ప్రారంభం కాలేదు. అనంతర కాలంలో కౌటాల మండలం వీర్దండి వద్ద వార్ధా నదిపై బ్యారేజీ నిర్మిస్తామని సర్వేలు చేసినా ఆ పనులు కూడా ప్రారంభం కాలేదు.

కల సాకారమయ్యేనా..?

ఆదిలాబాద్ పార్లమెంట్ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా 2008 మేలో తొలిసారి అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత నదిని పరిశీలించారు. అదే సంవత్సరం డిసెంబర్ 16న ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2018లో అసెంబ్లీ ఎన్నికలకు ముందు బస్సు యాత్రలో భాగంగా అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో అసంపూర్తిగా ఉన్న ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును కాంగ్రెస్ నేతలు సందర్శించారు. అప్పుడు పరిశీలనకు వచ్చిన బృందంలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, సీతక్క తదితరులు ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత నదిపై ప్రాజెక్టు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆ పార్టీ ప్రభుత్వం ఉండటంతో ప్రాజెక్టు నిర్మాణంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. ప్రాణహిత ప్రాజెక్ట్ పనులు పూర్తి చేసి సాగు నీరందించాలని కోరుతున్నారు.

అసెంబ్లీలో ప్రస్తావిస్తా



తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నదిపై సాగు నీటి ప్రాజెక్టు నిర్మాణానికి దాదాపు రూ.10 వేల కోట్లు ఖర్చు చేశారు. ప్రాజెక్టును పూర్తి చేయాలని గతంలో ఎన్నో ఆందోళనలు నిర్వహించాం. తుమ్మిడి హెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాలని అసెంబ్లీలో ప్రస్తావించి.. పరిష్కారం కోరుతా.. సిర్పూర్ నియోజకవర్గం చుట్టూ జీవనదులు ఉన్నా సాగునీటి సదుపాయం లేక వర్షాధార పంటలే పండిస్తున్నారు. ఎస్పీఎంలోని సమస్యలు, అర్హులందరికీ పోడు పట్టాల పంపిణీ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా..
– పాల్వాయి హరీశ్‌బాబు, సిర్పూర్ ఎమ్మెల్యే

‘అవినీతికి పాల్పడిన సంఘాలను ఓడించండి’

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్


మాట్లాడుతున్న భూపాల్

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణిలో అవినీతికి పాల్పడిన కార్మిక సంఘాలను గుర్తింపు ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. బుధవారం ఆర్కే 5, ఎస్సార్పీ 3, 3ఏ గనులపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు గెలిచిన సంఘాల వలన కార్మికులకు నష్టమే జరిగిందన్నారు. ప్రతీ వేతన ఒప్పందంలో సీఐటీయూ కృషి ఉందన్నారు. సీఐటీయూని గెలిపిస్తే కొత్త భూగర్భ గనులను తీసుకువచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ డివిజన్ కార్యదర్శి గోదారి భాగ్యరాజ్, ఉపాధ్యక్షుడు కస్తూరి చంద్రశేఖర్, ఆర్గనైజర్ వెంగళ శ్రీనివాస్, నాయకులు అజయ్, శ్రీనివాస్, సదానందం, శ్రీనివాస్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యాన్ని ప్రశ్నించి పనిచేయిస్తాం


కార్మికులతో మాట్లాడుతున్న శంకర్‌రావు

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో గెలిపిస్తే యజమానాన్ని ప్రశ్నించి కార్మికుల పనులు చేయిస్తామని ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు అన్నారు. బుధవారం ఆయన ఎస్సార్పీ 3, 3ఏ గనిపై కార్మికులను కలిసి మాట్లాడారు. కార్మికులు పనికోసం నాయకుల వద్దకు వెళ్తే లంచాలు ఇవ్వనిదే వారి పనులు చేయలేదని, ఆ విధానం ఇక ఉండదన్నారు. ఐఎన్టీయూసీ గెలిస్తే పారదర్శకంగా పనులు జరుగుతాయన్నారు. సమావేశంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేని శ్యాం, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, కేంద్ర కార్యదర్శులు సమ్ము రాజయ్య, మోతె రాఘవరెడ్డి, బ్రాంచి కార్యదర్శి శీలం చిన్నయ్య, నాయకులు జే.నర్సింగ్, మనోజ్, చంద్రమోహన్, వెంకటస్వామి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

‘ఏఐటీయూసీని గెలిపించి సింగరేణిని కాపాడాలి’


మాట్లాడుతున్న సమ్మయ్య

మందమర్రిరూరల్(చెన్నూర్): ఈ నెల 27న జరగనున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీని గెలిపించి సింగరేణిని కాపాడాలని యూనియన్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ ముస్కె సమ్మయ్య కోరారు. బుధవారం ఆయన ఏరియాలోని కేకే–5 గని ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. టీబీజీకేఎస్, ఐఎన్టీయూసీ సంఘాలను గెలిపిస్తే మితిమీరిన రాజకీయ జోక్యం ఉంటుందని, దీంతో సింగరేణి నష్టాల్లోకి వెళ్తుందన్నారు. ఈ సందర్భంగా పలువురు ఇతర యూనియన్ల నాయకులు ఏఐటీయూసీలో చేరారు. సమావేశంలో కేకే–5 గని పిట్ కార్యదర్శి శ్రీనివాస్, యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు నాగేశ్వరరావు, సుదర్శన్, రాజేశం, ప్రభాకర్, సాంబయ్య, ప్రేమ్‌లాల్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గెలిస్తే ఇంటిస్థలం ఇప్పిస్తాం

- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య


ఆర్కే న్యూటెక్ గనిపై మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్(మంచిర్యాల): సింగరేణి గుర్తింపు ఎన్నికల్లో గెలిస్తే ప్రతీ కార్మికునికి 250 గజాల ఇంటి స్థలం ఇప్పిస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. బుధవారం ఆర్కే న్యూటెక్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. ఎన్నో కార్మిక పోరాటాలు చేసి అనేక హక్కులను, సదుపాయాలను కల్పించామన్నారు. పైరవీకారి సంఘాలను చిత్తుగా ఓడించాలన్నారు. ఈ సందర్భంగా సుమారు 150 మంది కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ డెప్యూటీ జనరల్ సెక్రటరీ ముస్కె సమ్మయ్య, కేంద్ర కార్యదర్శి అక్బర్ అలీ, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొమురయ్య, పిట్ సెక్రటరీ ఆకుల లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

‘గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీదే విజయం’

జైపూర్(చెన్నూర్): ఈ నెల 27న జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటీయూసీదే విజయమని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. బుధవారం ఇందారం ఐకే 1ఏ గనిపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ మేనిఫెస్టో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులకు 250 గజాల ఇంటిస్థలం, రూ.20 లక్షల వడ్డీలేని రుణం ఇప్పిస్తామన్నారు. వివిధ యూనియన్లకు చెందిన 200 మంది ఏఐటీయూసీలో చేరారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి చింతల నవీన్‌రెడ్డి, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, నాయకులు చంద్రమోహన్, నాగభూషణం, శ్రీకాంత్, మాల కృష్ణ, విజయ్‌కుమార్, రాజయ్య, సురేష్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మంచిర్యాల జెడ్పీ బాలుర పాఠశాలలో ఈ నెల 12న నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జోనల్ స్థాయి బాక్సింగ్ పోటీల్లో హాజీపూర్ మండలం గుడిపేట మహాత్మ జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్–14 విభాగంలో టి.అక్షిత్‌వర్మ(బంగారు), పి.కార్తీక్(రజత), అండర్–17 విభాగంలో యూ.ప్రేమ్‌కుమార్, ఏ.ప్రేమ్‌కుమార్, యూ.ఇంద్రవర్మ(బంగారు), జి.అక్షిత్, ఎండీ.ధనిశ్, జే.దీపక్, ఎల్.నవీన్, బి.మధుకుమార్(రజత), అండర్–19 విభాగంలో జె.సంపత్ బంగారు పతకం సాధించాడు. బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ శేరు శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్, డెప్యూటీ వార్డెన్ సందీప్‌కుమార్, పీఈటీ కొట్టె దేవేందర్, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపిక


ఎంపికైన సుప్రజ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎల్.సుప్రజ టేబుల్ టెన్నిస్ అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.సుమతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నైలోని ఆమెట్ యూనివర్సిటీలో జరగనున్న అంతర్ విశ్వవిద్యాలయ టేబుల్ టెన్నిస్ పోటీల్లో సుప్రజ పాల్గొంటుందని ఆమె పేర్కొన్నారు. వ్యాయామ అధ్యాపకురాలు ఎస్.పద్మ, వైస్ ప్రిన్సిపాల్ కే.శివలీల, విద్యార్థినిని అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థులు

చెన్నూర్‌రూరల్: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నారాయణపేటలో ఈ నెల 13 నుంచి జరుగుతున్న అండర్–14 బాలబాలికల వాలీబాల్ పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపికయ్యారు. చెన్నూర్ మండలం ఆస్నాద జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు జి.జశ్వంత్, జి.వర్షిణి, ఎం.నక్షత్ర ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం అనురాధ, పీఈటీ గాజుల శ్రీనివాస్ తెలిపారు.

‘రెస్ట్‌హాల్ కబ్జా చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలి’

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని కేకే–5 గనిపై మహిళలకోసం ఏర్పాటు చేసిన రెస్ట్‌హాల్‌ను కబ్జా చేసిన అధికారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐటీయూసీ నాయకులు గనిపై అంటించిన పోస్టర్ కలకలం సృష్టించింది. వివరాలు ఇలా ఉన్నాయి. సింగరేణి యాజమాన్యం కేకే–5 గనిపై మహిళలకోసం రెస్ట్‌హాల్ కేటాయించింది. అట్టి హాల్‌ను గనిలో విధులు నిర్వర్తించే ఓ అధికారి కబ్జా చేసి సొంతానికి వాడుకుంటున్నాడు. దీంతో మహిళలకు ఇబ్బంది కరంగా ఉందని, వెంటనే రెస్ట్‌హాల్‌ను వారికి ఇవ్వాలని గనిపై నోటీస్ బోర్డుపై ఏఐటీయూసీ నాయకులు పోస్టర్ అంటించారు. దీంతో బుధవారం ఏఐటీయూసీ, టీబీజీకేఎస్ నాయకుల మధ్య గొడవకు దారి తీసింది.

పెళ్లికి నిరాకరించాడని దాడి

మంచిర్యాలక్రైం: ప్రేమ పెళ్లికి నిరాకరించాడని యువకుడిపై దాడికి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం దండేపల్లి మండలంలోని మ్యాదరిపేటకు చెందిన కుమ్రం అభిషేక్ అటవీశాఖలో సీనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. హాజీపూర్ మండలం రాపల్లికి చెందిన ఓ యువతితో రెండేళ్లుగా ప్రేమ వ్యవహారం సాగిస్తున్నాడు. పెద్దల సమక్షంలో పెళ్లికి ఒప్పుకున్న అభిషేక్ మళ్లీ పెళ్లికి నిరాకరించడంతో సదరు యువతి కుటుంబ సభ్యులు బుధవారం కాలేజ్‌రోడ్‌లో నివాసం ఉంటున్న అభిషేక్ ఇంటికి వచ్చి మందలించారు. ఈ క్రమంలో సదరు యువతి కుటుంబ సభ్యులు యువకుడిపై దాడికి పాల్పడ్డారు. అభిషేక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం కోసం ఘర్షణ

వేమనపల్లి: మేము రెవెన్యూ, పోలీసు అధికారులకు మామూళ్లిస్తున్నాం.. దర్జాగా బియ్యం కొంటాం.. అంటూ రేషన్ బియ్యం కొనుగోలుదారులు రోడ్డుపైనే ఘర్షణకు దిగారు. చెన్నూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బుధవారం బియ్యం కొనుగోలు చేసేందుకు వేమనపల్లికి వచ్చాడు. రూ.16కు కిలో చొప్పున కొంటానని తిరుగుతున్నాడు. వేమనపల్లికి చెందిన మరోవ్యక్తి నేను కిలోకు రూ.15 చొప్పున కొంటున్నానని.. నువ్వు ఇక్కడెందుకు కొంటున్నావని అతనితో గొడవకు దిగాడు. అధికారులకు మామూళ్లు ఇస్తున్నామని, సిరోంచలో ఏర్పాటు చేసిన బడా రైస్‌మిల్లు యజమానికి బియ్యం తరలిస్తున్నామని గొడవపడ్డారు. స్థానికులు ఆర్ఐ లక్ష్మణ్‌కు సమాచారం అందించడంతో అధికారులు వచ్చేలోపే బియ్యంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

నేటి నుంచి గీతా జయంతి వేడుకలు

నస్పూర్: శ్రీమద్భగవద్గీత సత్సంగ్ ఆధ్వర్యంలో నేటి నుంచి ఈ నెల 23 వరకు గీతా జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు సత్సంగ్ అధ్యక్షుడు దాసరి రాజేశం తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడుతూ కృష్ణా కాలనీలో గీతా ప్రశాంతి నిలయం నెలకొల్పి 25 సంవత్సరాలు పూర్తి కావస్తున్న సందర్భంగా రజతోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కన్వీనర్ డీడీ ప్రసాద్, సభ్యులు లక్ష్మీనారాయణ, రాజబాబు, ఎం.సారయ్య, రాజమౌళి, మల్లేశ్, రాజేశ్వరి, స్వర్ణకుమారి, లక్ష్మీ, సత్యవతి, రమాదేవి, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.